సాక్షి
మహబూబాబాద్

శనివారం । 15 । మార్చి । 2025



లక్ష్యాన్ని ఛేదించారు..
ఉమ్మడి జిల్లాలోని పలువురు యువత తమ లక్ష్యాన్ని ఛేదించారు. గ్రూప్–3 ఫలితాల్లో పలువురు ఉత్తమ ర్యాంకులు సాధించి తమ కలను సాకారం చేసుకున్నారు. - 8లో▸



భూపాలపల్లిలో మరో పులి ?
జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమలాపూర్, రాంపూర్ గ్రామాల మధ్య పులి పాదముద్రలను ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
40.1^0 /20.6^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ కాస్త మంచు కురుస్తుంది.



న్యూస్‌రీల్

రైల్వేస్టేషన్‌కు విద్యుత్‌కాంతులు



మహబూబాబాద్ రూరల్: అమృత్ భారత్ పథకంలో భాగంగా మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో ఆధునికీకరణ పనులు జరుగుతున్నారు. పనులు పూర్తికానున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి రైల్వే స్టేషన్ ఒకటో నంబరు ప్లాట్‌ఫాం వైపున ప్రధాన ద్వారం పరిసరాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించగా కొత్త శోభను సంతరించుకుంది.

18, 19 తేదీల్లో జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్: కేయూలోని ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 18, 19 తేదీల్లో రెండు రోజులపాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. '75 ఇయర్స్ ఆఫ్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్–మైల్ స్టోన్స్ ఇష్యూస్ అండ్ చాలెంజెస్' అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ టి.రాజమణి ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సు ప్రారంభోత్సవానికి హైకోర్టు పూర్వపు జడ్జి, ప్రస్తుత మహాదాయి వాటర్ ట్రిబ్యూనల్ జడ్జి పీఎస్ నారాయణ, తెలంగాణ హ్యూమన్ రైట్స్ పూర్వపు చైర్మన్ జస్టిస్ చంద్రయ్య, కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం హాజరవుతారని పేర్కొన్నారు.

ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి..



హన్మకొండ: వినియోగదారులు ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకోవాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు, సీసీఐ సీనియర్ సెక్రటరీ డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హనుమకొండ ఎక్సైజ్ కాలనీలో జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల చైతన్య సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఏ వస్తువు కొన్నా.. ఒరిజినల్ బిల్లులు తీసుకోవాలన్నారు. ఉత్పత్తిదారుడు ఇచ్చే గ్యారెంటీ, వారంటీ కార్డులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. వస్తువుల్లో నాణ్యతా లోపం ఉన్నప్పుడు వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయం పొందాలన్నారు.

నేడు, రేపు రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు



వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర 10వ టెన్నీకాయిట్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ ఈ నెల 15, 16వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు టెన్నికాయిట్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు అలువాల రాజ్‌కుమార్, గోకారపు శ్యాంకుమార్ తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు 300 మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఇందులో గెలుపొందిన జట్లు ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. శనివారం సాయంత్రం ప్రారంభంకానున్న పోటీలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, విశిష్ట అతిథిగా కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తదితరులు హాజరవుతారని వారు వివరించారు.

అప్రమత్తత తప్పనిసరి

- వస్తు సేవల్లో మోసాలపై జాగ్రత్త అవసరం
- కొనుగోలు చేసే సమయంలో పరిశీలన ముఖ్యం

నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం



తొర్రూరు: నాణ్యమైన వస్తువులు, సేవలనూ పొందడం వినియోగదారుల హక్కు. కానీ ప్రస్తుత కాలంలో మోసాలు ఎక్కువైపోయాయి. చివరికి మనం తాగే పాలు, నీళ్లలో కూడా నాణ్యత లేకుండాపోతోంది. తూకాల్లో భారీగా తేడాలు ఉంటున్నాయి. వీటిపై ఎవరైనా ప్రశ్నిస్తే, నిలదీస్తే తప్ప న్యాయం జరగడం లేదు. ఈ తరహా మోసాలను అరికట్టాలంటే వినియోగదారులే మేల్కొనాల్సిన అవసరం ఉంది. తమ హక్కులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. కాగా వినియోగదారులు మోసపోకుండా అండగా వినియోగదారుల రక్షణ చట్టం ఉంది. 1986 నుంచి ఇది అమలులో ఉండగా 2019లో మెరుగులుదిద్దారు. మార్పులతో ఏర్పడిన ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

చట్టం గురించి..

- 34 ఏళ్ల నుంచి ఉన్న చట్టంలో మార్పులు చేర్పులు చేసి కొత్తగా ఏర్పాటైన రక్షణ చట్టం–2019 జూలై 20, 2020 నుంచి అమల్లోకి వచ్చింది.
- వినియోగదారుల ఫిర్యాదులు వేగంగా పరిష్కరించుకోవడానికి ఇది దోహదం చేస్తుంది.
- నూతన చట్టం ప్రకారం సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) స్థాపించారు. దీని ద్వారా వినియోగదారుల హక్కులను ప్రోత్సహిస్తూ పరిరక్షిస్తున్నారు.
- వినియోగదారుల ఫోరంను వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌గా మార్చారు.

ఎక్కడ ఫిర్యాదు చేయాలంటే..

- వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక్కటే ఉంది.
- నేరుగా ఫోన్‌లో ఫిర్యాదు చేసే వీలు ప్రస్తుతం లేదు.
- హనుమకొండ సుబేదారిలో కమిషన్ కార్యాలయం ఉంది.
- కమిషన్ కార్యాలయంలో వినియోగదారులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. సంబంధిత రశీదు, ఇతర ఆధారాలతో ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుంది.
- దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న టోల్‌ఫ్రీ నంబర్ 180042500333 కు ఫోన్ చేసి మరింత సమాచారం తెలుసుకోవచ్చు.



వినియోగదారుల సమాచార కేంద్రంలో ఫిర్యాదుతో నష్టపరిహారం చెక్కులు అందుకున్న రైతులతో డీసీఐసీ కన్వీనర్ సుధాకర్(ఫైల్)

కొనుగోలు విషయంలో సూచనలు..

కొనుగోలు చేస్తున్న వస్తువులు, సేవలపై గరిష్ట పరిమాణం, ఏ గ్రేడ్‌కు చెందినవి, వాటిలో కలిపిన పదార్థాలు, రంగులు, రసాయనాలు, ఎలా ఉపయోగించారో తెలిపే ప్రకటనను వినియోగదారులు కచ్చితంగా గమనించాలి. మందులు, ఆహార పదార్థాల చట్టం ప్రకారం అన్ని ఆహార పదార్థాల ప్యాకేజీలపై విధిగా నికర మొత్తం లేబుల్స్‌పై చూపాలి. వస్తువు ధర, తయారీ తేదీ, గడువు తేదీ, తయారీదారు చిరునామా, వస్తువు బరువు ముద్రించి ఉండాలి. ఉత్పత్తులపై ముద్రించిన ఎంఆర్‌పీపై స్టిక్కర్ అంటించి దాని ధరను మార్చి అమ్మడం జరుగుతుంది. ఈ విషయంలో కచ్చితంగా గమనించాలి.

ఫిర్యాదు ఎలా చేయాలంటే...

ఫిర్యాదు చేసే విధానం చాలా సులభం. అలాగే దానిపై స్పందన కూడా త్వరగా ఉంటుంది. తెల్ల కాగితంపై ఫిర్యాదు వివరాలు రాసి పంపవచ్చు. న్యాయవాది అవసరం లేదు. ఫిర్యాదుదారుడైనా, అతడి ఏజెంటైనా ఫోరంలో స్వయంగా ఫిర్యాదు చేయవచ్చు. అలా వీలు కాకపోతే పోస్టు ద్వారా కూడా పంపే వీలుంది.

పరిహారాన్ని బట్టి ఫోరం..

- రూ.20 లక్షల వరకు జిల్లా ఫోరంలో ఫిర్యాదు చేయాలి.
- రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రాష్ట్ర కమిషన్‌లో...
- రూ.కోటి మించిన పక్షంలో జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు చేయాలి.
- కొనుగోలు చేసినా లేదా నష్టం జరిగిన నాటి నుంచి రెండేళ్ల లోపు ఫిర్యాదు చేయవచ్చు. ఆలస్యానికి తగిన కారణం తెలిపితే ఆపై సంవత్సరం కూడా ఫిర్యాదు చేయవచ్చు.

ప్రశ్నించారు.. గెలిచారు

- జిల్లాలోని చిన్నగూడూరుకు చెందిన రైతు రావుల రాంరెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో ఓ కంపెనీకి చెందిన ఆడమగ వరి విత్తనాలు వేశాడు. అవి నాసిరకం కావడంతో పంట పూర్తిగా పోయింది. కంపెనీ ప్రతినిధులు స్పందించకపోవడంతో వినియోగదారుల సమాచార కేంద్రాన్ని ఆశ్రయించాడు. బాధిత రైతుకు ఆ కంపెనీ రూ.5.60 లక్షల నష్ట పరిహారం చెల్లించింది.
- నర్సింహులపేటకు చెందిన రైతు నరసింహారెడ్డి, దాట్ల గ్రామానికి చెందిన భూపాల్‌రెడ్డి కూడా ఇలాంటి కంపెనీల నుంచి రూ.7 లక్షల నష్టపరిహారం పొందారు.
- తొర్రూరు పట్టణానికి చెందిన పందెబోయిన సురేశ్ ప్రైవేటు చిట్‌ఫండ్ కంపెనీలో చిట్ వేశాడు. కాలపరిమితి పూర్తయినా డబ్బులు చెల్లించకపోవడంతో ఆయన వినియోగదారుల సమాచార కేంద్రాన్ని ఆశ్రయించాడు. సదరు సంస్థకు నోటీసులు అందించి చిట్టి డబ్బులు రూ.5లక్షలు ఇప్పించి బాధితులకు న్యాయం చేశారు.

అవగాహన అవసరం



కొనుగోళ్ల సందర్భంలో వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలి. ఏ వస్తువు, సరుకులు కొనుగోలు చేసినా విధిగా రశీదు తీసుకోవాలి. అన్యాయం జరిగితే నష్టం పరిహారం, న్యాయం పొందడానికి ఈ రశీదు ఉపయోగపడుతుంది. బాధితులు పూర్తి వివరాలతో ఫిర్యాదు చేస్తే వినియోగదారుల సమాచారం కేంద్రం ద్వారా న్యాయం లభిస్తుంది.

-వింజమూరి సుధాకర్, వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా కన్వీనర్

అంబరాన్నంటిన హోలీ సంబురాలు



హోలీ ఆడుతున్న చిన్నారులు

- ఎస్పీ క్యాంపు కార్యాలయంలో వేడుకలు

మహబూబాబాద్ రూరల్ : జిల్లాలో హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. చిన్నారులు, యువతీ యువకులు పెద్దలు, వృద్ధులు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. కులమతాలకు అతీతంగా పాల్గొని నృత్యాలు చేస్తూ రంగులు పూసుకుని హోలీ ప్రత్యేకతను చాటారు. ఆడిపాడి హోలీ సంబురాలు జరుపుకున్నారు.

ఎస్పీ క్యాంపు కార్యాలయంలో..

హోలీ పండుగ సందర్భంగా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పోలీసు ఉన్నతాధికారులతో కలిసి డీజే పాటలకు నృత్యాలు చేసి సిబ్బందిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్, తొర్రూరు డీఎస్పీలు తిరుపతిరావు, కృష్ణకిశోర్, జిల్లా పోలీసు కార్యాలయంలోని వివిధ విభాగాల డీఎస్పీలు మోహన్, శ్రీనివాస్, విజయ్ ప్రతాప్, సీఐలు నరేందర్, చంద్రమౌళి, సత్యనారాయణ, దేవేందర్, సర్వయ్య, రవికుమార్, రాజేష్, సూర్యప్రకాష్, రాజ్ కుమార్, గణేష్, ఆర్‌ఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీని ఎత్తుకొని నృత్యం చేస్తున్న పోలీసులు

సభా వేదిక దేవన్నపేట!

- బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ స్థలం
- పరిశీలించిన మాజీ మంత్రి హరీశ్ తదితరులు
- సభ సక్సెస్‌కు త్వరలో కమిటీలు.. ఉమ్మడి జిల్లా నేతలతో కేసీఆర్ భేటీ?

సాక్షిప్రతినిధి, వరంగల్ : బీఆర్‌ఎస్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తలపెట్టిన రజతోత్సవ సభకు గ్రేటర్ వరంగల్ పరిధి దేవన్నపేట శివారును నాయకులు ఎంపిక చేశారు. 14 ఏళ్ల అవిశ్రాంత పోరాటాన్ని, పదేండ్ల పరిపాలనపై ఏడాది పాటు వేడుకలు నిర్వహించాలని భావించిన బీఆర్‌ఎస్.. వరంగల్ సభ ద్వారా ప్రారంభించాలని తలపెట్టింది. ఈ నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ పరిధి ఉనికిచర్ల, బట్టుపల్లి, దేవన్నపేట ప్రాంతాల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో ముఖ్యనేతలు ఈనెల 10న స్థలపరిశీలన చేశారు. అయితే ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా.. సభకు హాజరయ్యే జనం ఈజీగా వచ్చిపోయేలా ఉండాలని భావించి శుక్రవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, ముఖ్యనేతలు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితరులతో కలిసి హరీశ్‌రావు స్థల పరిశీలన చేశారు. ఎన్‌హెచ్ పక్కన ఉండటంతో పాటు నలుమూలల నుంచి వాహనాల ద్వారా వచ్చిపోయేందుకు దేవన్నపేట అనువుగా ఉంటుందని భావించి అధినేత కేసీఆర్ సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. చివరకు దేవన్నపేటను ఫైనల్ చేసినట్లుగా చెప్పారు. స్థలపరిశీలన అనంతరం హరీశ్‌రావు సుమారు గంటపాటు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో మాట్లాడారు. 15 లక్షల మందితో భారీ సభ నిర్వహించడానికి నాయకత్వం ఏర్పాట్లు చేస్తున్నది. సభ సక్సెస్ కోసం ఉమ్మడి వరంగల్‌కు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో కేసీఆర్ భేటీ కానున్నారని సమాచారం.



దేవన్నపేటలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న హరీశ్‌రావు, ఎర్రబెల్లి తదితరులు

పల్లెరోడ్లకు మహర్దశ

- రూ.33 కోట్ల నిధులు మంజూరు
- నెలాఖరులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సిందే..

మహబూబాబాద్ అర్బన్: వర్షంపడితే చిత్తడిగా మారుతున్న పల్లె రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్, ములుగు, ఇల్లెందు, పాలకుర్తి నియోజకవర్గాల్లోని మండలాల్లో 641 సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.33.75కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ పనులను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించగా.. ఈనెలాఖరు వరకు పూర్తి చేయాల్సి ఉంది.

నెలాఖరులోగా..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో పనులు చేపట్టేందుకు నిధులు విడుదల చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ నిధులను ఈనెలాఖరు వరకు వినియోగించుకొని పల్లెల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి. ఒక్కో సీసీ రోడ్డుకు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నిధులు కేటాయించారు. రూ.5లక్షల లోపు నిధులు టెండర్ లేకుండా.. ఆపై నిధులకు టెండర్లు పిలవాల్సి ఉంటుంది. కాగా పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలి.. లేకుంటే నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి ఉంటుంది.



సీసీ రోడ్డు వేస్తున్న సిబ్బంది(ఫైల్)

జిల్లాలో మంజూరైన పనులు, నిధులు..

మండలం	పనులు	మంజూరైన నిధులు
మహబూబాబాద్	49	రూ. 2.45కోట్లు
నెల్లికుదురు	49	రూ. 2.45కోట్లు
గూడూరు	45	రూ.2.30కోట్లు
కేసముద్రం	47	రూ.2.20కోట్లు
మరిపెడ	54	రూ.2.80 కోట్లు
చిన్నగూడూరు	21	రూ.1.10కోట్లు
నర్సింహులపేట	32	రూ.1.60కోట్లు
దంతాలపల్లి	32	రూ. 1.60కోట్లు
డోర్నకల్	36	రూ.2.05కోట్లు
కురవి	51	రూ.2.75కోట్లు
తొర్రూరు	52	రూ.2.28కోట్లు
పెద్దవంగర	37	రూ.1.75కోట్లు
గార్ల	40	రూ.2కోట్లు
బయ్యారం	43	రూ.2.15కోట్లు
కొత్తగూడ	32	రూ.1.62కోట్లు
గంగారం	21	రూ.1.05కోట్లు
మొత్తం	641	రూ.33.75 కోట్లు

గ్రామాలకు రవాణా సౌకర్యం

అన్ని గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సీసీ రోడ్లకు ప్రత్యేక నిధులను కేటాయించారు. మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా, సిమెంట్ రోడ్లుగా మారుస్తాం. ఈ రోడ్లన్నీ మండల రోడ్లకు లింక్ అవుతాయి. 75శాతం పల్లెల్లో రోడ్లు పూర్తవుతాయి.



-భూక్య మురళీనాయక్, మానుకోట ఎమ్మెల్యే

పునర్విభజనపై చర్చ..

- నియోజకవర్గాల డీలిమిటేషన్ ఉంటుందని ప్రచారం
- నూతన జిల్లాల ఏర్పాటుతో ముక్కలుగా నియోజకవర్గాలు
- చివరగా 2008లో విభజన
- మానుకోట పట్టణం ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడే అవకాశం



సాక్షి, మహబూబాబాద్: వచ్చే సార్వత్రిక ఎన్నికల లోపు నియోజకవర్గాల పునర్విభన జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. జిల్లాను యూనిట్‌గా చేసుకొని నియోజకవర్గాలను ఏర్పాటు చేస్తారా.. లేక భౌగోళిక స్థితిగతులను ఆధారంగా చేసుకొని విభజిస్తారా అనే అంశంపై చర్చ జరుగుతోంది. కాగా మానుకోట పట్టణం ప్రత్యేక నియోజకవర్గంగా ఆవిర్భవిస్తుందా.. రిజర్వేషన్‌లో మార్పు ఉంటుందా అనే విషయాలపై రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. అయితే నియోజకవర్గాల విభజన ఇప్పుడే ఉండదని మరికొందరు చెబుతున్నారు.

చివరగా 2008లో..

ఉమ్మడి వరంగల్ జిల్లాగా ఉన్నప్పుడు 2008లో నియోజకవర్గాల పునర్విభన జరిగింది. అప్పుడు మహబూబాబాద్ డివిజన్ పరిధిలోని మహబూబాబాద్, డోర్నకల్‌తోపాటు పాలకుర్తి నియోజకవర్గంలోని కొంత భాగం ఉండేది. అయితే ఇందులో మహబూబాబాద్ నియోజకవర్గంలో నెక్కొండ, పర్వతగిరి మండలాల్లోని కొన్ని గ్రామాలు ఉండగా.. మహబూబాబాద్ పట్టణంలో భాగమైన జమాండ్లపల్లి, గుమ్మడూరు, అనంతారం గ్రామాలు డోర్నకల్ నియోకవర్గంలో, నర్సింహులపేట మండలంలోని కొన్ని గ్రామాలు చెన్నూరు నియోజకవర్గంలో, మరికొన్ని డోర్నకల్‌లో ఉండేవి. పునర్విభజన తర్వాత ఉమ్మడి నర్సింహులపేట, మరిపెడ, కురవి, డోర్నకల్ మండలాలు డోర్నకల్ నియోజకవర్గంలోకి, గూడూరు, నెల్లికుదురు, కేసముద్రం, మహబూబాబాద్ మండలాలు మహబూబాబాద్ నియోజకవర్గంలో చేర్చారు. ఒక మండలం పూర్తిస్థాయిలో ఒక నియోజకవర్గంలో ఉండేలా విభజన చేశారు. కాగా అప్పటి వరకు జనరల్ స్థానంగా ఉన్న మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలు ఎస్టీ రిజర్వుడ్ అయ్యాయి.

జిల్లాల ఏర్పాటుతో సమస్య...

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు డివిజన్, గంగారం, ఇనుగుర్తి, పెద్దవంగర, దంతాలపల్లి, సీరోలు, చిన్నగూడూరు మండలాలు కొత్తగా ఏర్పడ్డాయి. అయితే మొత్తం 18 మండలాలు ఐదు నియోజకవర్గాల పరిధిలోకి వచ్చాయి. జిల్లాలో మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలు పూర్తిస్థాయిలో ఉండగా.. గార్ల, బయ్యారం ఇల్లెందు నియోజకవర్గంలో ఉన్నాయి. కొత్తగూడ, గంగారం మండలాలు పేరుకు మహబూబాబాద్ జిల్లాలో ఉన్నా.. నియోజకవర్గ రివ్యూలు, ఇతర సభలు, సమావేశాలు ములుగు జిల్లా కేంద్రంలోనే జరుగుతున్నాయి. అదే విధంగా తొర్రూరు, పెద్దవంగర మండలాలు పాలకుర్తి నియోజకవర్గంలో ఉన్నాయి. కాగా ఆ నియోజకవర్గం మహబూబాబాద్, వరంగల్, జనగామ జిల్లాల పరిధిలో ఉంది. దీంతో నియోజకవర్గ రివ్యూలు, ఇతర అభివృద్ధి నిధుల కేటాయింపు మొదలైన నిర్ణయాల కోసం మూడు జిల్లాల అధికారులు హాజరు కావాల్సి వస్తోంది..

ఏర్పాటుపై చర్చ

జిల్లా యూనిట్‌గా చేసుకొని విభజన జరిగితే కొత్తగూడ, గంగారం, గూడూరు, బయ్యారం కలిపి ఒక నియోజకవర్గం, మహబూబాబాద్ పట్టణంతోపాటు కేసముద్రం, ఇనుగుర్తి మండలాలు కలిపి నియోజకవర్గం, నెల్లికుదురు, తొర్రూరు, పెద్దవంగర, దంతాలపల్లి, నర్సింహులపేట మండలాలతో ఒక నియోజకవర్గం, మరిపెడ, చిన్నగూడూరు, కురవి, సీరోలు, డోర్నకల్, గార్ల మండలాలతో మరో నియోజకవర్గం, మొత్తంగా జిల్లాలో నాలుగు ఆపైగా నియోజకవర్గాలుగా ఏర్పడే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఇలా చేయడం వల్ల మహబూబాబాద్, తొర్రూరు నియోజకవర్గాలు జనరల్ స్థానాలుగా, మిగిలిన రెండు స్థానాలు ఎస్టీ రిజర్వేషన్ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొనే అధికార కాంగ్రెస్‌తో పాటు, బీఆర్‌ఎస్, బీజేపీ మొదలైన పార్టీలకు చెందిన కొందరు నాయకులు, ఎన్ఆర్ఐలు, డాక్టర్లు, మహబూబాబాద్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే మరో మూడున్నర సంవత్సరాల తర్వాత ఎన్నికలు వస్తాయని, అప్పటి వరకు ఎన్ని పరిణామాలు జరుగుతాయో.. ఏం అవుతుందో.. అనేది వేచి చూడాల్సిందే.

నేటి నుంచి ఒంటిపూట బడులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ అన్ని పాఠశాలల్లోనూ ఈనెల 15వ తేదీ నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమై కొనసాగనున్నాయి. ప్రతీ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలను నిర్వహిస్తారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులకు తప్పనిసరిగా తరగతులు అయిపోయాక మధ్యాహ్న భోజనం పెట్టాల్సి ఉంటుంది. ఈనెల 21 నుంచి టెన్త్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఉన్నందున.. పరీక్ష కేంద్రాలుగా ఉన్న హైస్కూళ్లను మధ్యాహ్నం ఒంటి గంటనుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలి. విద్యార్థులకు ముందే మధ్యాహ్న భోజనం అందించి తరువాత క్లాస్‌లు నిర్వహించాలని విద్యాశాఖాధికారులు తెలిపారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఈనెల 16న నిర్వహించనున్న సీఎం సభకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలో శివునిపల్లిలో వ్యవసాయ మార్కెట్ సమీపాన నిర్వహించనున్న సీఎం రేవంత్‌రెడ్డి సభకు సంబంధించిన సభాస్థలాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్ బాషా శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే పార్కింగ్ స్థలాలు, తాగునీటి సౌకర్యం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, సరిపడా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సీఎం సభను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్, డీసీపీ రాజమహేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం, కలెక్టర్ రిజ్వాన్‌బాషా

క్లుప్తంగా

18, 19 తేదీల్లో ఎంబీఏ అడ్మిషన్ల కౌన్సెలింగ్

విద్యారణ్యపురి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎంబీఏ హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్(హెచ్‌హెచ్‌సీఎం) అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆ వర్సిటీ అభ్యాసక సహాయ సేవా విభాగం(ఎల్‌ఎస్‌ఎస్‌బీ) డైరెక్టర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ ప్రవేశ పరీక్ష, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన టీజీఐసెట్‌లో అర్హత సాధించిన వారికి అవకాశం ఉందన్నారు. ఆసక్తి ఉన్న వారు అంబేడ్కర్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో ఆయా తేదీల్లో నిర్వహించే అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు అర్హత పరీక్ష, ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు ఒకసెట్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. అంబేడ్కర్ వర్సిటీ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వలో పడి మహిళ మృతి

పర్వతగిరి: ఎస్సారెస్పీ కాల్వలో కొట్టుకుపోయి మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని హట్యతండా శివారు ఎర్రకుంట తండాలో చోటు చేసుకుంది. ఎస్సై బోగం ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రకుంటతండాకు చెందిన బాదావత్ నేజి(78) గురువారం ఉదయం దుస్తులు ఉతకడానికి ఎస్సారెస్పీ కాల్వలోకి వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి కొట్టుకుపోయింది. శుక్రవారం ఉదయం నెక్కొండ మండలం బొల్లికొండ తండా వద్ద ఎస్సారెస్పీ కెనాల్‌లో శవమై తేలి కన్పించింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భూపాలపల్లి అటవీ గ్రామాల్లో మరో పులి ?



పులి పాదముద్రలు

భూపాలపల్లి రూరల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలంలోని కమలాపూర్, రాంపూర్ గ్రామాల మధ్య ఫారెస్టు అధికారులు శుక్రవారం పులి పాదముద్రలు గుర్తించారు. కాటారం, మండలం జాదారావుపేట గ్రామ పంచాయతీ పరిధిలో రఘుపల్లి అటవీ ప్రాంతంలో చెరువుకట్టపై ఈ నెల 12న ఆవు దూడను చంపి తిన్నట్లు ఆనవాళ్లు లభించాయి.

పాదముద్రలు వేరేనా..?

శుక్రవారం కాటారం మండలం మేడిపలి, కొత్తపల్లి గ్రామాల మీదుగా భూపాలపల్లి మండలంలోని రాంపూర్, కమలాపూర్ అటవీ గ్రామాల మధ్య పులి అడుగుజాడలను ఫారెస్టు అధికారులు గుర్తించారు. కాటారం పులి పాదముద్రలు, ఈ పులి పాదముద్రలు సరిపోకపోవడంతో మరో ఆడ పులిగా అనుమానిస్తున్నారు. కాటారం మండలంలో మగ పులి, భూపాలపల్లి మండలలో ఆడ పులి తిరుగుతున్న నేపథ్యంలో భూపాలపల్లి అటవీ గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. గ్రామస్తులకు పులి కనపడిన, అటవీలో ఉచ్చులు, విద్యుత్ తీగలు అమర్చి పులులకు ప్రమాదాన్ని కలిగించినా.. కఠిన చర్యలు తప్పవని ఫారెస్టు అధికారులు హెచ్చరిస్తున్నారు.

లక్ష్యాన్ని ఛేదించారు..



గ్రూప్స్‌లో మెరిసిన యువత | రెండుకు మించి ఉద్యోగాలు

పట్టుదల, ఏకాగ్రతే వారధిగా ఉద్యోగ వేట సాగించిన ఉమ్మడి జిల్లాలోని పలువురు యువత తమ లక్ష్యాన్ని ఛేదించారు. కష్టానికి ప్రతిఫలాన్ని పొంది గెలుపుబావుటా ఎగురవేశారు. పేదరికం, ఆర్థిక ఇబ్బందులను ఎదిరించి ఉన్నత ఉద్యోగాలను కైవసం చేసుకుని సత్తా చాటారు. గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3 ఫలితాల్లో పలువురు ఉత్తమ ర్యాంకులు సాధించి తమ కలను సాకారం చేసుకున్నారు. లక్ష్యాన్ని ఛేదించి ఆదర్శంగా నిలిచిన యువత వివరాలు ఇలా...

చిరు వ్యాపారి బిడ్డకు మూడు ఉద్యోగాలు



డోలి సంధ్య

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని కేసముద్రం రోడ్డులో ఆర్టీసీ బస్టాండ్ వద్ద చిన్న హోటల్ నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్న డోలి వెంకటేశ్వర్లు –పద్మ దంపతులు. వారి కుమార్తె డోలి సంధ్య గ్రూప్–3లో 450 మార్కులకు 269.9 మార్కులతో 1,125 ర్యాంక్ సాధించింది. జోనల్ స్థాయిలో బీసీ(ఏ) మహిళల విభాగంలో 2వ ర్యాంక్ సాధించింది. అయితే ఇప్పటికే గ్రూప్–4లో ఉన్నత ర్యాంకు సాధించిన సంధ్య మానుకోట మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌గా విధుల్లో కొనసాగిస్తోంది. అదే విధంగా ఈ నెల 11న విడుదలైన గ్రూప్–2 ఫలితాల్లో సంధ్య 600 మార్కులకు 382.4 మార్కులతో 205 ర్యాంక్ సాధించింది. రాష్ట్రస్థాయిలో మహిళల విభాగంలో 16 స్థానం, బీసీ(ఏ)లో మహిళల విభాగంలో మొదటి ర్యాంక్ సాధించారు. గ్రూప్–2లో మంచి పోస్ట్ వస్తే ఆ ఉద్యోగంలో చేరుతానని చెబుతున్న సంధ్యను తల్లిదండ్రులు, స్నేహితులు అభినందించారు.

గ్రూప్–3లో సత్తా చాటిన ప్రణీత్



ప్రణీత్

కొడకండ్ల: గ్రూప్–2 ఫలితాల్లో ప్రతిభను చాటుకున్న కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన చెన్న ప్రణీత్ గ్రూప్–3 ఫలితాల్లో 285 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 395 ర్యాంక్‌ను సాధించి సత్తా చాటాడు. 2019లో సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఎస్సీ పూర్తి చేసిన ప్రణీత్ సివిల్స్ సాధించాలనే సంకల్పంతో ఉండగా గ్రూప్స్ నోటిఫికేషన్లు రావడంతో వాటిపై దృష్టి సారించాడు. గ్రూప్–4 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 55వ ర్యాంక్ సాధించి ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రణీత్ గ్రూప్–2 ఫలితాల్లో 388 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 138వ ర్యాంక్ సాధించడమే కాకుండా గ్రూప్–3 ఫలితాల్లోనూ ప్రతిభను చాటుకున్నాడు. నిరుపేద పద్మశాలీ కుటుంబానికి చెందిన ప్రణీత్ ఉత్తమ ర్యాంక్ పొందడంపై తల్లిదండ్రులు చెన్న సోమనారాయణ నాగలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

కోచింగ్ లేకుండానే..



సుంకరి కేదారేశ్వర్‌రెడ్డి

జనగామ రూరల్: జనగామ మండలం సిద్దంకి గ్రామానికి చెందిన సుంకరి కేదారేశ్వర్‌రెడ్డి ఎలాంటి కోచింగ్‌లేకుండానే ఇటీవల విడుదలైన గ్రూప్– 2 ఫలితాల్లో 112వ ర్యాంక్, గ్రూప్–3 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంక్ సాధించి సత్తాచాటాడు. సిద్దంకి గ్రామానికి చెందిన సుంకరి శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు కేదారేశ్వర్‌రెడ్డి సివిల్ సప్లయిస్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. ఈ సందర్భంగా కేదారేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎలాంటి కోచింగ్ లేకుండానే గ్రూప్– 2లో ఉత్తమ ర్యాంక్ రావడం సంతోషంగా ఉందన్నారు. కేదారేశ్వర్‌రెడ్డి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజలకు ఉత్తమ సేవ అందిస్తా..

- గ్రూప్–3 26వ ర్యాంకర్ అజయ్‌కుమార్



అజయ్‌కుమార్

చిట్యాల: ప్రజలకు ఉత్తమ సర్వీస్ అందిస్తానని గ్రూప్–2 స్టేట్ 43వ ర్యాంక్ సాధించిన నల్ల అజయ్ కుమార్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల తిర్మలాపూర్ గ్రామానికి చెందిన నల్ల కోంరయ్య–నీలమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దవాడైన అజయ్ కుమార్ ఒకటి నుంచి పదో తరగతి వరకు మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో చదివాడు. ఇంటర్ హనుమకొండలోని శివానీ కాలేజీలో, బీటెక్ హైదరాబాద్‌లో చదివాడు. 2018లో కానిస్టేబల్ ఉద్యోగం, 2024లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో ఇటీవల విడుదలైన గ్రూప్– 2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 43వ ర్యాంక్, కాళేశ్వరం జోన్‌లో 7వ ర్యాంక్ సాధించాడు. శుక్రవారం విడుదలైన గ్రూప్–3 ఫలితాల్లో స్టేట్ 26వ ర్యాంక్ సాధించాడు. గ్రూప్–2 ద్వారా వచ్చే ఉద్యోగాన్ని ఎంపిక చేసుకుని ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని చెబుతున్నాడు.. అజయ్‌కుమార్.

తండా వాసికి 1,126 ర్యాంక్



తేజావత్ సూర్యకుమారి

మహబూబాబాద్ అర్బన్: కేసముద్రం మండలం పెనుగొండ గ్రామం వాచ్యా తండాకు చెందిన తేజావత్ సూర్యకుమారి గ్రూప్–3లో 450 మార్కులకు 269 మార్కులు సాధించి 1,126 ర్యాంక్ సాధించింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన తేజావత్ పెద్దరాములు– స్వరూప కుమార్తె సూర్యకుమారి గ్రూప్ –3లో ఉత్తమ ర్యాంక్ సాధించడంపై కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, హర్షం వ్యక్తం చేసున్నారు.

గ్రూప్–3లో స్టేట్ 57వ ర్యాంక్



రాజశేఖర్‌రెడ్డి

బచ్చన్నపేట : మండల కేంద్రానికి చిమ్ముల అరుణ–మల్లారెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరి కూతురు ప్రస్తుతం జనగామ మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తుండగా.. కుమారుడు చిమ్ముల రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం వెలువడిన గ్రూప్–3 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 57వ ర్యాంక్ సాధించారు. గ్రూప్–2 ఫలితాల్లో 423.933 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి 8వ ర్యాంక్ సాధించాడు. గతంలో రాజశేఖర్‌రెడ్డి వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం గ్రూప్స్‌లో ఉత్తమ ర్యాంక్‌లు సాధించడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భద్రాచలానికి గోటి తలంబ్రాలు



ఖానాపురం: తలంబ్రాలను భద్రాచలం తరలిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

ఖానాపురం: మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో గత తొంబై రోజులుగా గోటితో ఒలిచిన తలంబ్రాలకు పూజారి పర్వతపు శివప్రసాద్‌శాస్త్రి ప్రత్యేక పూజలు చేశారు. గోటితో ఒలిచిన తలంబ్రాలను భద్రాచలం సీతారామచంద్ర స్వామి కల్యాణమహోత్సవానికి తరలించారు. అక్కడ ఆలయంలో తలంబ్రాలతో కలిపి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మరికొన్ని తలంబ్రాలను తీసుకొచ్చి కల్యాణ వేడుకలను చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపూడి సుబ్బారావు తెలిపారు.

గూడూరు: సీతారాముల కల్యాణోత్సవంలో ఉపయోగించే గోటి తలంబ్రాలను భక్తులు శుక్రవారం గూడూరు నుంచి భద్రాచలం చేర్చారు. శ్రీరామ నవమికి ముందు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు గోటితో ఒలిచిన బియ్యాన్ని తలంబ్రాల కోసం తరలిస్తారు. ఈ క్రమంలో గూడూరు మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో హిందూ జాగరణ సమితి ఆధ్వర్యంలో గత నెల 24 నుంచి భక్తులు ధాన్యాన్ని గోటితో ఒలిచే కార్యక్రమం చేపట్టారు. హిందూ జాగరణ సమితి, సేవికా సమితి మహిళలు అందరూ కలిసి గోటి తలంబ్రాలను భద్రాచల రాములవారి దేవాలయానికి చేర్చారు. హోలీ పండుగ సందర్భంగా అక్కడ రంగులు చల్లుకొని సంబురాన్ని పంచుకున్నట్లు మహిళలు తెలిపారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్ ముదిరాజ్

- తెలంగాణ ముదిరాజ్ కో–ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్

నెహ్రూసెంటర్: రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి చేస్తానని తెలంగాణ ముదిరాజ్ కో–ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాంచంద్రాపురం కాలనీలో ముదిరాజ్, మత్స్యకారులతో కలిసి శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక వర్గాల బలోపేతం కోసం కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపుతున్నట్లు తెలిపారు. ఇటీవల జిల్లాలో కురిసిన అతిభారీ వర్షాల కారణంగా కోట్లాది రూపాయల విలువైన మత్స్యసంపదను కోల్పోయి నష్టపోయిన ముదిరాజ్ మత్స్యకారులను ఆదుకునేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో గల ముదిరాజ్ పెద్దలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేలా సీఎం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. గత ప్రభుత్వ విధానాల వల్ల కోకాపేటలో ముదిరాజ్‌లకు ఇచ్చిన ముదిరాజ్‌ల ఆత్మగౌరవ భవన నిర్మాణం స్థల వివాదం కారణంగా నిలిచిపోయిందన్నా రు. మహిళా మత్స్యకార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో తెలంగాణ ఫిషర్‌మెన్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొడుగు శ్రీనివాస్, తెలంగాణ మహాజన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అల్లుడు జగన్, సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి దుండి వెంకటేశ్వర్లు, పిడుగు వెంకన్న, పెద్ది సైదులు, సందీప్, బాలాజీ, ఉప్పలయ్య, గోపాల్, వెంకన్న పాల్గొన్నారు.

పట్టపగలే యువకుడి దారుణ హత్య

- తీగారంలో హోలీ రోజున ఘటన
- భయాందోళనకు గురైన గ్రామస్తులు



గోనె ప్రవీణ్ మృతదేహం

జఫర్‌గఢ్: తన వ్యవసాయ బావి వద్ద ఒంటరిగా ఉన్న యువకుడిని మరో గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు కత్తితో పొడిచి చంపిన ఘటన జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలంలోని తీగారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన ప్రకారం .. తీగారం గ్రామానికి చెందిన గోనె యాదగిరి–ఈశ్వరమ్మ దంపతుల చిన్న కుమారుడు గోనె ప్రవీణ్ (28) ఇంటి వద్దనే ఉంటూ తండ్రితో కలసి వ్యవసాయం చేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి వద్ద భోజనం చేసిన అనంతరం ప్రవీణ్ నీళ్లు పెట్టేందుకు గ్రామ శివారులో ఉన్న తమ వరిపొలం వద్దకు వెళ్లాడు. అప్పటికే ఇదే మండలంలోని తమ్మడపల్లి (ఐ) గ్రామానికి ఆరుగురు యువకులు మూడు ద్విచక్రవాహనాలపై తీగారం గ్రామానికి చేరుకొని ప్రవీణ్‌ను అనుసరించారు. పొలం వద్ద ఒంటరిగా ఉన్న ప్రవీణ్‌పై ఒక్కసారిగా దాడి చేసి కత్తితో కడుపులో 5 పోట్లు పొడిచి అక్కడి నుంచి బైక్‌లపై పరారయ్యారు. కత్తిపోట్లకు గురైన ప్రవీణ్ పెద్ద పెట్టున అరవడంతో కొద్దిదూరంలో ఉన్న సమీప బంధువులు రక్తపు మడుగులో ప్రవీణ్‌ను స్థానికులు, కుటుంబ సభ్యుల సాయంతో స్టేషన్‌ఘన్‌పూర్‌కు తరలించారు. వైద్యుల సూచనల మేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా ప్రవీణ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, యువకుడి హత్యకు దారితీసిన కారణాలు తెలియరాలేదు. హోలీ పండుగ పూట గ్రామంలో యువకుడి హత్యతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్‌చరణ్ వెల్లడించారు.

కౌలురైతు ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి



చిట్యాల: అప్పుల బాధ తట్టుకోలేక కౌలు రైతు సూర కుమారస్వామి (40) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన సూర కుమారస్వామి నాలుగు సంవత్సరాల క్రితం గుంటూరుపల్లి గ్రామానికి వచ్చి నివాసం ఉంటున్నాడు. పెద్ద కుమార్తెకు పెండ్లి చేశాడు. మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప పంట వేశాడు. కుమార్తె పెండ్లికి తెచ్చిన అప్పుతోపాటు మూడు ఎకరాలలో వేసిన పంట సక్రమంగా పండకపోవడంతో రూ.12లక్షల వరకు అప్పులు అయ్యాయి. దీంతో గత నెల 19న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై ఈశ్వరయ్య పేర్కొన్నారు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బతుకుదెరువుకోసం వచ్చి..

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మేస్త్రీ

- మృతుడిది ఏపీలోని ప్రకాశం జిల్లా పాలేటిపాడు



చికిత్స పొందుతున్న శివమణి



ప్రమాదస్థలంలో పడిఉన్న క్షతగాత్రులు

సంగెం: బతుకుదెరువు కోసం వలస వచ్చిన ఓ భవననిర్మాణ కార్మికుడు రోడ్డు ప్రమాదంలో తనువు చాలించిన విషాద ఘటన వరంగల్ జిల్లా సంగెం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా జిగురుమల్లి మండలం పాలేటిపాడు గ్రామానికి చెందిన కోయ బంగారుబాబు(34) తన భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలతో కలిసి పొట్టకూటి కోసం సంగెం మండల కేంద్రంలో కొన్నేళ్లుగా ఉంటూ.. భవన నిర్మాణ తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పనిపై తిమ్మాపూర్ గ్రామానికి తోటి మేస్త్రీ ఉలవపాడుకు చెందిన పులగర శివమణి అలియాస్ మణికంఠతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి సంగెంకు వస్తున్నారు. ఈక్రమంలో వరంగల్ నుంచి నెక్కొండ వైపునకు అరటిగెలలు తీసుకొచ్చేందుకు ట్రేలతో వెళ్తున్న బోలేరో అతివేగంగా అజాగ్రత్తగా సబ్‌స్టేషన్ సమీపంలో.. వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బంగారు బాబుకు కుడి చేయి, కాలుకు, శివమణికి కుడి చేయి, కుడి కాలుకు గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బంగారుబాబు మృతి చెందగా.. శివమణి చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఎంజీఎంలో పోస్టుమార్టమ్ అనంతరం బంగారుబాబు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. కాగా, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన బోలేరో వాహనం తప్పించుకుని వెళ్లగా సీసీ కెమెరాల సాయంతో ట్రేస్ చేశామని ఎస్సై తెలిపారు.

రోడ్డుపై యువకుల న్యూసెన్స్

- కారు ఆపి అద్దాలు పగులగొట్టి హల్‌చల్



ధ్వంసమైన కారు అద్దాలు



ఘటనా స్థలంలో గుమికూడిన ప్రజలు

హసన్‌పర్తి: హోలీ రంగుల్లో మునిగితేలిన యువకులు చిత్తుగా మద్యం సేవించారు. ఎదురుగా వస్తున్న కారును ఆపారు.. కారు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగి.. అద్దాలు పగులగొట్టారు. 56వ డివిజన్ వివేకానంద కాలనీలో శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వివేకానంద కాలనీకి చెందిన ఓ కారు హనుమకొండ వైపునకు బయల్దేరింది. అప్పటికే చిత్తుగా మద్యం సేవించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఏడుగురు వలస కూలీలు ఆ కారు అడ్డగించారు. తమకు కారు తాళం చెవి ఇవ్వమని డిమాండ్ చేశారు. అందుకు కారు డ్రైవర్ నిరాకరించడంతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో మరో యువకుడు బండరాయిని కారు అద్దాలపైకి విసరడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. స్థానికులు ఆపడానికి ప్రయత్నించగా యువకులు మరింత రెచ్చిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని యువకులను అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఘటన సమయంలో కారులో డ్రైవర్‌తోపాటు కారు యజమాని(మహిళ) ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. తులసీ రెస్టారెంట్ అండ్ బార్‌ను తొలగించాని, నిత్యం మద్యంప్రియులు గొడవలు చేస్తుండడంతో ఇబ్బందిగా ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బ్యాంక్ నిర్లక్ష్యంపై వినియోగదారుల కమిషన్ కన్నెర్ర

వరంగల్: కాజీపేట రైల్వే పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి అశోక్‌కుమార్.. మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నుంచి తీసుకున్న రూ.29,000 పర్సనల్ లోన్‌ను 2004 డిసెంబర్ 7లోనే పూర్తిగా చెల్లించారు. అయినప్పటికీ 19 ఏళ్లుగా ఇంటి కాగితాలు ఇవ్వకుండా తిప్పలు పెట్టడంతో అశోక్‌కుమార్ వినియోగదారుల మండలి సహకారంతో 2023లో వరంగల్ జిల్లా వినియోగదారుల కమిషన్ (వినియోగదారుల కోర్టు)లో ఫిర్యాదు చేశాడు. అయితే అశోక్‌కుమార్‌తోపాటు సహోద్యోగులైన 30మంది 2002 సంవత్సరంలో ఒక్కొక్కరు రూ.29వేలు పర్సనల్ లోన్ తీసుకుని, రెండు సంవత్సరాల తర్వాత చెల్లించారు. అయితే అందులో ఇద్దరు మాత్రం చెల్లించలేదు. కె.నర్సయ్య అనే ఉద్యోగి చనిపోగా, ఎం.భాస్కర్ అనే ఉద్యోగి రిటైర్డ్ అయిపోయాడు. అయితే మొత్తం 30మంది ఉద్యోగులకు లీడర్‌గా వ్యవహరించిన అశోక్ కుమార్ తన అప్పు పూర్తిగా చెల్లించాడు. కానీ, మిగతా ఇద్దరు బాకీ చెల్లించిన తర్వాతనే.. అశోక్ కుమార్ ఇంటి కాగితాలు విడుదల చేస్తామని బ్యాంకు అధికారులు మొండికేశారు. పర్సనల్ లోన్ తీసుకున్న తర్వాత, వారి వేతనాల నుంచి డిడక్షన్ చేసి, వాయిదా మొత్తాలను బ్యాంకుకు పంపాల్సిన బాధ్యత పోస్టల్ అధికారులదే.. ఈ క్రమంలో పోస్టల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల మిగిలిపోయిన ఇద్దరి బకాయిలకు అశోక్‌కుమార్‌ను బాధ్యున్ని చేస్తూ, అతని ఇంటి కాగితాలు ఇవ్వకుండా మహేష్ కోఆపరేటివ్ బ్యాంక్ 19ఏళ్లుగా సతాయిస్తున్నట్లు కమిషన్ అధ్యక్షుడు జి.నాగరాజు, సభ్యులు వి.నరసింహారావు నిర్ధారణకు వచ్చారు. దీంతో అశోక్‌కుమార్‌కు ఇంటి కాగితాలు ఇవ్వాలని, బ్యాంకు బాకీ ఉన్న వారి నుంచి లోన్ డబ్బులు వసూలు చేసుకోవాలని తెలిపారు. కేసు కోసం అయిన ఖర్చులు రూ.20వేలు బ్యాంక్ చెల్లించాలని ఆదేశించారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి


- విద్యుత్ మోటారు ఫ్యూజులు సరిచేస్తుండగా ఘటన



సురేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య రేణుక

సంగెం: విద్యుదాఘాతంతో ఓ యువరైతు మృతి చెందిన విషాద ఘటన వరంగల్ జిల్లా సంగెం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వీఆర్ఎన్ తండాకు చెందిన గుగులోత్ సురేష్(27)కు భార్య రేణుక, ఇద్దరు కవలలు మనోహర్, మణిదీప్, కూతురు మనీషా ఉన్నారు. వ్యవసాయం చేస్తూ కుటుంబపోషణ చేసుకుంటున్నాడు. తన ఎకరం భూమిలో మొక్కజొన్న పంట సాగు చేశాడు. శుక్రవారం మధ్యాహ్నం మొక్కజొన్నకు నీరు పారించేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. మోటార్ ఆన్‌చేస్తే పని చేయకపోవడంతో ఫ్యూజులు సరిగా ఉన్నాయా.. లేదోనని ఫ్యూజులు, స్టాటర్ ఉన్న బాక్స్‌లో చేయి పెట్టి తీసే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై కేకలు వేసి పడిపోయాడు. పక్క చేనులో ఉన్న అదే తండాకు చెందిన గుగులోత్ రాజు వచ్చి సురేష్‌ను లేపబోయే సరికి అతనికి విద్యుత్ షాక్ తగిలింది. ఇద్దరు పడి కొట్టుకుంటుండగా మరో చేనులో ఉన్న రాజు వచ్చి దగ్గరలోని విద్యుత్ స్తంభంపై తీగలను తొలగించాడు. సురేష్‌ను ద్విచక్రవాహనంపై ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ముందుగా సురేష్‌ను కాపాడబోయిన రాజు తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.

వెంకటేశ్వర్లపల్లిలో..



రవి (ఫైల్)

రేగొండ: పంట చేనుకు నీరు పెట్టడానికి వెళ్లి విద్యుత్‌షాక్‌తో ఓ రైతు మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్లపల్లికి చెందిన ఇట్టబోయిన రవి (49) గురువారం అర్ధరాత్రి తన వ్యవసాయ బోరు వద్ద కరెంటు మోటార్‌ను ఆన్ చేయడానికి వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. శుక్రవారం ఉదయం అటువైపు వెళ్లిన రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య రజిత, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు.